వీధి కుక్కల స్వైరవిహారం!

- బెల్లంపల్లిలో పెరిగిన శునకాల సంతతి
- కు.ని ఆపరేషన్లపై దృష్టి సారించని బల్దియా
- గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి
- గాడితప్పిన ఏబీసీ సెంటర్ నిర్వహణ



నంబర్-2 ఇంక్లైన్ బస్తీలో రోడ్డుపై తిరుగుతున్న వీధి కుక్కల గుంపు

బెల్లంపల్లిలో వీధి కుక్కల వివరాలు

మున్సిపల్‌వార్డులు	34
బల్దియాలో సంచరిస్తున్న వీధి కుక్కలు	2000పైనే(అనధికారిక లెక్కల ప్రకారం)
కు.ని ఆపరేషన్ చేయించిన వీధి కుక్కలు	90(ఈఏడాది సెప్టెంబర్ 31 వరకు)
వీధి కుక్కలకు కట్టించిన షెడ్లు	0



కుక్కలదాడికి గురై నుజ్జునుజ్జయిన ఆటో

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. వీటి నియంత్రణపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలపై రెచ్చిపోయి దాడులకు తెగబడుతున్నాయి. రోడ్డుపై ఒంటరిగా నిలబడి ఉన్నా, మార్కెట్‌కు వెళ్తున్నా, చివరికి బైక్‌పై వెళ్తున్నా వీటి బారిన పడక తప్పడం లేదంటున్నారు పురప్రజలు. ఇక చిన్నారులను చూస్తే మరింతగా దాడులు చేస్తున్నాయి. చిన్నాపెద్దా తారతమ్య బేధం లేకుండా శునకాల కాటుకు గురవుతున్న ఘటనలు తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయి. వీధి కుక్కల వల్ల ప్రజల ప్రాణాలకు రక్షణ లేని పరిస్థితులు కనిపిస్తున్నా చర్యలు తీసుకోవడంలో అధికారయంత్రాంగం తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

పేరుకే ఏబీసీ సెంటర్...

జిల్లాలో కేవలం మంచిర్యాలలో మాత్రమే ఏబీసీ సెంటర్ ఉంది. అక్కడికి శునకాలను వ్యాన్‌లో తీసుకెళ్లి కుటుంబ నియంత్రణ(కు.ని) ఆపరేషన్ చేయించి తిరిగి బెల్లంపల్లికి తీసుకురావాల్సి ఉండగా, అలాంటి చర్యలు మొక్కుబడిగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. సిబ్బంది లేమీ, ఇతరత్ర బీజీ పనులతో సతమతమవుతున్న అధికారులు, సిబ్బంది వీధి కుక్కల విషయంలో అంతగా దృష్టిసారించకపోవడంతో కుక్కల నియంత్రణ నీరుగారిపోతోంది. ఏబీసీ సెంటర్ నిర్వహణ సరిగా లేకపోవడం, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం వంటి సమస్యలు లక్ష్యానికి అనుగుణంగా కుక్కల కు.ని ఆపరేషన్లు జరగలేకపోతున్నట్లు తెలుస్తోంది. కాగా కుక్కల బెడద నివారణకు షెడ్లు నిర్మించాల్సి ఉన్నా, ఇంతవరకు అమలుకు నోచుకోలేదు.

కు.ని ఆపరేషన్లు చేయిస్తాం

వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉన్న మాట వాస్తవమే. వీటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుత సంవత్సరం సెప్టెంబర్ నెల వరకు 90కుక్కలకు ఆపరేషన్లు చేయించాం. మిగితా వీధి కుక్కలను కూడా ఏబీసీ సెంటర్‌కు తరలించి కు.ని శస్త్రచికిత్సలు చేయించి తీసుకొస్తాం. కుక్కకాటు ఘటనలు జరగకుండా తగిన శ్రద్ధ తీసుకుంటాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి కుక్క కాటుకు గురికాకుండా స్వీయనియంత్రణ చర్యలు తీసుకోవాలి.

– మున్సిపల్ కమిషనర్, తన్నీరు రమేశ్

సంఘటనలు...

- బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని ఓ వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిపై ఆకస్మికంగా వీధి కుక్కల గుంపు దాడి చేసి కాళ్ల పిక్కలను, చేతులను కరిచి రక్తం కళ్ల జూశాయి. బెదరగొట్టే చర్యలు చేపట్టిన ఏమాత్రం భయపడక కుక్కలు దాడికి తెగబడ్డాయి.
- శాంతిఖని బస్తీలో రోడ్డు పక్కన నిలిచిఉన్న వ్యక్తిపై రోడ్డుపై గుంపుగా వెళ్తున్న వీధి కుక్కలు రెచ్చిపోయి ప్రతాపాన్ని చూపాయి. వ్యక్తిని చుట్టుముట్టి తీవ్రంగా బెదరగొట్టి గాయాల పాలు జేశాయి.
- చికెన్ కొనడానికి ఓ వ్యక్తి తన ఏడేళ్ల వయస్సు కలిగిన కొడుకును వెంట తీసుకుని కాంటా చౌరస్తా సమీపంలో చికెన్ కొనుగోలు చేసి పక్కనే ఉన్న కూరగాయలు అమ్మే మహిళ వద్దకు వెళ్లి కొత్తిమీర కొనుగోలు చేస్తుండగా ఆకస్మికంగా వచ్చిన వీధికుక్కలు రోడ్డు పక్కన నిల్చొని ఉన్న చిన్నారిపై విరుచుకుపడి చేతిని రక్కడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది.
- టేకుల బస్తీ కల్వర్టు ప్రాంతంలో ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా సడన్‌గా పరుగెత్తుకొచ్చిన వీధి కుక్కలు బైక్ కింద దూరడంతో అదుపు తప్పి బైక్ కింద పడిపోగా వాహన దారుడికి తీవ్ర గాయాలు తగిలాయి. తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.
- కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదువుకుంటున్న తమ కుమార్తెను చూసి తిరిగి బెల్లంపల్లి వైపునకు వస్తుండగా పోశమ్మగడ్డ చౌరస్తా సమీపంలో వీధి కుక్కలు గుంపుగా రెచ్చిపోయి ఆటోను వెంబడించి బోల్తా పడగొట్టించాయి. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఆటో ముందుభాగం నుజ్జునుజ్జయింది.

గెలిచే అభ్యర్థులనే ఎంపిక చేద్దాం

- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

జన్నారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకునేందుకు గెలిచే వారిని అభ్యర్థులుగా ఎంపిక చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సోమవారం ఎంపీటీసీ స్థానాల వారీగా ఆయా గ్రామాల కార్యకర్తలు, నాయకులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంపీటీసీ, సర్పంచుల అభ్యర్థుల ఎంపికలో గ్రామాల వారీగా కార్యకర్తలు, నాయకులు కూర్చొని గెలిచే వారిని, మంచి పేరున్న వారిని ఎంపిక చేయాలని సూచించారు. గ్రూపులకు తావులేకుండా కలిసికట్టుగా పని చేసి అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. గ్రామాల్లో గడపగడపకూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను, అభివృద్ధిని వివరించాలని తెలిపారు. గ్రామాల వారీగా కార్యకర్తల సమస్యలను, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్ చోర్ పై అవగాహన కల్పించి, సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ నాయకులు శుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శంకరయ్య, ఇసాక్, నందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సింగరేణి మెరిట్ స్కాలర్‌షిప్



జాహ్నవికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న అధికారులు

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ అడ్మిన్ భవన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థిని ఎర్రోజు జాహ్నవికి సింగరేణి మెరిట్ స్కాలర్‌షిప్ అందించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినికి అందించి మాట్లాడారు. సింగరేణి సంస్థ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఏటా మెరిట్ స్కాలర్ షిప్ అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సింగరేణి విజిలెన్స్ డిపార్టుమెంట్‌లో సీనియర్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న ఎర్రోజు రాజ్‌కుమార్‌చారి కుమార్తె జాహ్నవి మెడికల్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి రామగుండం సింగరేణి మెడికల్ కాలేజీలో సీటు సాధించినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో జీఎం నరసింహారావు, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ అప్పారావు, ఏజీఎం మధన్‌మోహన్, మురళీధర్, డీజీఎం కిరణ్‌బాబు, విజిలెన్స్ డిపార్టుమెంట్ విభాగాధిపతి రామబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

భీమిని: కన్నెపల్లి మండలంలోని మాడవెల్లిలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం సోమవారం మండల బీజేపీ అధ్యక్షుడు మైదం ఆశన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. కన్నెపల్లి మండల ఎన్నికల ప్రభారీ, జిల్లా కార్యదర్శి రామాగౌని మహిధర్ గౌడ్ హాజరయ్యారు. మండలంలోని జెడ్పీటీసీ, 5 ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే ఆశావహులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు రామయ్యయాదవ్, నాయకులు బర్ల పోషన్న, సంతోష్, అరికల భీమన్న, ఇందూరి సత్తయ్య, మల్లేశ్, భాస్కర్, రాజు, శ్రీనివాస్, తిరుపతి, విజయ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

దండేపల్లి: మండలంలోని దిశ మోడల్‌స్కూల్ జైతుగూడ, కుంటల్‌గూడ గిరిజన ప్రాథమిక పాఠశాలలను ఏసీఎంవో లక్ష్మణ్ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పాఠశాల రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. సమయపాలన పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కన్నెపల్లిలో పశువైద్య శిబిరం

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లిలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 170పశువులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం పశుపోషకులకు పశువుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్ వివరించారు.

క్లుప్తంగా

12వరకు ఆర్‌టీఐ వారోత్సవాలు

బెల్లంపల్లి: సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి ఇరవై ఏళ్లు కావస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఈ నెల 5నుంచి 12వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టీఐ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామటెంకి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార హక్కు చట్టం 2005లో అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఐ వారోత్సవాలను నిర్వహించడానికి ముందుకొచ్చిందని తెలిపారు. వారోత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

భీమారం: మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకంను ఘనంగా నిర్వహించారు. శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఏర్పాటు చేసిన శివలింగానికి మంత్రార్చన చేస్తూ అభిషేకం చేశారు. భీమారం, మంచిర్యాల, సీసీసీ, కొల్లూరు, పారిపల్లిలో ఇంటింటా స్వామి ఫొటోలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు, కన్వీనర్ సాయిని లక్ష్మినారాయణ, కో కన్వీనర్ మధూకర్ రెడ్డి, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనిపై సోమవారం ఐఎన్‌టీయూసీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులకు సభ్యత్వం నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేని శ్యాం, తిరుపతిరాజు, జీవన్‌జోయల్, శీలం చిన్నయ్య, బ్రాంచీ నాయకులు చంద్రమోహన్, లక్ష్మీనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

దండారీ ఉత్సవాల కమిటీ ఎన్నిక



సమావేశమైన ఆదివాసీ దండారీ నాయకులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ సల్పాల వాగు వెంకటాద్రి ఆలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దండారీ నిర్వాహకులు సమావేశమై ఉత్సవాల కమిటీని ఎన్నుకున్నారు. గ్రామాల నుంచి ఆదివాసీ దండారీ నిర్వాహకులు, గ్రామ పటేళ్లు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు అందరూ కలిసి ఏటా నిర్వహించే దండారీని, ఈ సంవత్సరం నిర్వహించేందుకు సమావేశమై చర్చించారు. ఈ నెల 15నుంచి దండారీ నిర్వహణకు తీర్మాణించారు. 15న దండారీ నిర్వహణ దేవుళ్ల పూజలు, సాయంత్రం దండారీ, 16న దండారీ దర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా కుంరం జనార్దన్, ప్రధానకార్యదర్శి ఆడె జంగు, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, గౌరవాధ్యక్షుడు రాయిసిడాం రాందాస్, ఉపాధ్యక్షులు పెంద్రం ప్రభాకర్, ఆత్రం జంగు, రాయిసిడాం సోము, కనక గోవర్ధన్, సోయం సూరు, మడావి ధర్మరావు, సిడాం గణపతి, కోశాధికారి మెస్రం రంజిత్, కార్యదర్శులుగా కుడిమేత లక్ష్మణ్, కోట్నాక రాజేష్, ఆత్రం శ్రీనివాస్, రాయిసిడాం రమేష్, సిడాం రాజు, కుంరం జగ్గెరావు, ప్రచార కార్యదర్శులు రాందాస్, మన్మోహన్, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

జన్నారం: వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం జన్నారం మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, శరత్‌మాక్స్ విజన్ కంటి దవాఖానాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సిటిజన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు మొండయ్య హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వృద్ధులకు కంటి పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

పంటల పరిశీలన

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల్లో పండిస్తున్న వరి పంటకు ఎండు తెగులు ఆశించింది. భీమారం శివారులోని వరిపంటలను సోమవారం ఏవో సుధాకర్ సందర్శించారు. వరుసగా వర్షాలు ఉండటంతో పంటకు తెగుళ్లు ఆశిస్తున్నాయని ఏవో తెలిపారు. ఆకు ఎండుతెగులు ఆశించిందని దీని నివారణ కోసం హెక్సాకొనసాల్, వాలిడామైసిన్ 400మిల్లీ లీటర్లలో ప్లాంటోమైసిన్ 80గ్రాములు కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత



అవగాహన ర్యాలీ చేస్తున్న అటవీ అధికారులు



బైనాక్యులర్‌తో పక్షులను తిలకిస్తున్న విద్యార్థులు

జన్నారం: వన్యప్రాణుల, అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ డివిజనల్ అధికారి రామ్మోహన్ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం అటవీశాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వన్యప్రాణులపై, అడవులపై అవగాహన పెంపొందించడానికి ప్రతీ సంవత్సరం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీవో తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకొని అటవీశాఖ అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రేంజ్ అధికారులు సుష్మారావు, మమత, శ్రీధరాచారి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

‘వన్యప్రాణులతో పర్యావరణానికి మేలు’

వేమనపల్లి: వన్యప్రాణులతో పర్యావరణానికి మేలు జరుగుతుందని నీల్వాయి అటవీ రేంజర్ హఫీజోద్దీన్ అన్నారు. వన్యప్రాణుల సప్తాహ్ వారోత్సవాలను పురస్కరించుకొని నీల్వా యి జెడ్పీహెచ్ పాఠశాల వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అడవుల్లో వన్యప్రాణులు, పక్షులు క్షేమంగా ఉంటేనే జీవవైవిధ్యం కొనసాగుతుందన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సమీపంలోని అటవీప్రాంతానికి తీసుకెళ్లి బైనాక్యులర్లతో విద్యార్థులకు పక్షులను చూపించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్‌కుమార్, హెచ్‌ఎం గిరిధర్ రెడ్డి, ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సీపీఎం పోటీ



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

చెన్నూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో చెన్నూర్ మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు సీపీఎం పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. చెన్నూర్ సీపీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చెన్నూర్ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఎన్నో పోరాటాలు చేసిందని, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పనిచేస్తున్న సీపీఎం పార్టీ అభ్యర్థులను గెలుపించాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో చెన్నూర్ మండల కార్యదర్శిగా బొడెంకి చందు, నాయకులు, నాయకురాళ్లు కుందరపు చంద్రన్న, నాగజ్యోతి, సమ్మక్క, సరిత, మహేశ్‌లు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా

- వేతనాలు చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఓబీ పనులు నిర్వహించే సీఆర్ఆర్ కాంట్రాక్టర్ 4 నెలలుగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో వారు సోమవారం జీఎం కార్యాలయం గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా తమను సీఆర్ఆర్ కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పండుగ పూట కూడా వేతనాలు చెల్లించలేదన్నారు. చివరికి పనులు కూడా బంద్ చేసి తమకు దొరకకుండా పోయారని వాపోయారు. వేతనాల కోసం కంపెనీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. తమకు పూర్తి వేతనాలు చెల్లించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు కూడా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు రాజేందర్, జీ.రమేశ్, జక్కుల రాయలింగు, కొల్లూరు రాజు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మహేష్ వర్మ, దినాకర్ దీపక్‌కుమార్, పడాల శివతేజ పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు..

తమతో పని చేయించుకొని వేతనాలు చెల్లించకుండా మోసం చేశారని కాంట్రాక్ట్ కార్మికులు శ్రీరాంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు కూడా ఫిర్యాదు అందించారు. సదరు కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా గుంత..!



భీమారం: చెన్నూర్-మంచిర్యాల జాతీయ రహదారిలో భీమారం వద్ద ప్రమాదకరంగా గుంత మారింది. గుంత గమనించక ప్రమాదాలు జరుగుతున్నట్లు ప్రయాణికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవేస్ అధికారులు చర్యలు తీసుకొని మరో ప్రమాదం జరగకముందే పూడ్చించాలని కోరుతున్నారు.

కొమ్మలు కొట్టారు.. అక్కడే వదిలారు



మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధి పాతమంచిర్యాలలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ అధికారులు నరికేసి, రోడ్డు పక్కన, ఇళ్ల ముందు పడేశారు. చెట్ల కొమ్మల్లో కర్ర ఎక్కువ ఉన్న వాటిని తీసుకెళ్లి, ఆకులతో కూడిన కొమ్మలను వదిలేశారు. దీంతో రోజుల తరబడి చెత్త ఇళ్ల ముందుఉండి ప్రజలు ఇళ్లకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురుస్తుండడంతో, చెట్ల కొమ్మలు తడిసి దుర్వాసనతో పాటు, దోమలు విజృంభిస్తున్నాయి. వెంటనే చెట్ల కొమ్మలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు



జైపూర్: ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు

జైపూర్: జైపూర్ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా స్థానిక హైస్కూల్లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, ఏర్పాట్లను సోమవారం ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావుతో కలిసి పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ మధులత, స్థానిక పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్, తదితరులు ఉన్నారు.

వేమనపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం రాబోయే ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ఎంపీడీవో కుమారస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సాయిబాబు, ఎంపీడీవో క్షేత్రస్థాయి ఎన్నికల విధి విధానాలపై పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురైనా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో సానిటేషన్, తాగునీటి సమస్య ఎదురైతే కార్యదర్శులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ సాయికృష్ణ, పీఆర్ ఏఈ ప్రదీప్, ఏపీవో మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్‌వోలు పాల్గొన్నారు.

అధికారుల ఫోజులు.. అటకెక్కిన పనులు



‘స్వచ్ఛతా హీ సేవ’లో డీఆర్డీవో, ఎంపీడీవో, అధికారులు



ఇప్పటికీ అలాగే ఉన్న చెత్తకుప్ప

లక్సెట్టిపేట: ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం అధికారుల ఫొటోల ఫోజులకే పరిమితమవుతుంది. చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేసే అధికారులు వారి కార్యాలయ పరిసరాల్లోనే పరిశుభ్రతను పాటించడం లేదు. సెప్టెంబర్ 25న డీఆర్డీవో కిషన్, ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి స్వచ్ఛతా హీ సేవ, స్వచ్ఛోత్సవ్ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించి కార్యాలయం ఆవరణలో ఉన్న చెత్తకుప్ప వద్ద ఫొటోలు దిగి అధికారులతో ప్రతిజ్ఞ చేయించి వెళ్లిపోయారు. ఎంపీడీవో సరోజ, సంబంధిత అధికారులు, సిబ్బంది ఇప్పటివరకు చెత్తను తొలగించకుండా అలాగే వదిలేశారు. దీంతో ఫొటోలపై ఉన్న శ్రద్ధ, పనులపై లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దుస్తులు పంపిణీ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్ సోమవారం దుస్తులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు.